చీకటి తెర

శ్రీ ఆర్. యం. చిదంబరం

ఆకాశం మబ్బులముసుగు కప్పుకుంది. కత్తులు ఝుళిపిస్తున్నట్లు మెరుపులు. మధ్యమధ్య గుండె అదిరేటట్టు ఉరుములు. మూడురోజులుగా వర్షం నిరంతర వాహినిగా కురుస్తోంది. రేడియో సరిగ్గా పలకటం లేదు. గడబిడ తగ్గిద్దామని వాల్యూం తగ్గించాను. చలిగాలి జివ్వున వీస్తుంటే తలుపులు వేసేద్దామని కిటికీ దగ్గరకు వెళ్లాను. పక్క నేవున్న శాంతా క్రూజ్ లో దిగటానికి, శత్రుసైన్యాన్ని చీల్చుకుపోతున్న వీరుడులా, ఎదురు తిరుగుతున్న ప్రకృతిని చీల్చుకుంటూ వెడుతోంది ఒక విమానం.

రోడ్డుకు వారగా పసుపుపచ్చటాక్సీ ఆగింది.

కిటికీతలుపులు వేయటం మానేసి ఎవరు దిగుతున్నారా అని చూస్తున్నాను. అమ్మాయేఅయుండాలి. మొహానికడ్డంగా తెరచిన గొడుగుండటంవలన గుర్తు తెలియటం లేదు. కాళ్ళకు ఎర్రటి స్లిప్పర్లున్నాయి. చీర కుచ్చెళ్లు ఎత్తిపట్టుకుని నడుస్తోంది. వెనకాల డ్రైవరు సామాను తెస్తున్నాడు.

ఓనిమిషం గడిచాక కాని ఆమె ఫస్టుఫ్లోరుకే వస్తోందని, అందులోనూ నాగదిలోకే వస్తోందని నాకు తెలియ లేదు.

'నమస్కారమండి! నేను గుర్తున్నాననే అనుకుంటా' అంటూ డ్రైవరుకు డబ్బిచ్చి పంపింది.

'జ్ఞాపకంలేకేం శారదా?' అంటూ రేడియో వాల్యూం పూర్తిగా తగ్గించాను. హాండ్ బాగ్ లోంచి టవల్ తిసి ముఖంమీదున్న నీటిబిందువుల్ని తుడుచుకుంది. మూడురోజుల ప్రయాణంతాలూకు బడలిక ముఖంమీద స్పష్టంగాకనిపిస్తోంది. సరిగ్గా పదమూడు నెలల్క్రితం చూసిన శారదకూ—ఈశారదకూ—చాలా వ్యత్యాసాలు కనిపించాయి. చిదిపితే ప్రణయరసం చిమ్మే చెక్కిళ్లు—అరడజనుమంది సంతానాన్ని కన్న తల్లిలా తయారయ్యాయి. రెండుజడలు వేసుకుంది. నుదుటిమీద అర్ధచంద్రాకారపు బొట్టు—బొంబాయివస్తోందని తనకుమాత్రం తెలియదా ఏమిటి? ముఖంలో ఇదివరకున్న కాంతి—మమకారం—కామం—ఇప్పుడు దర్శనమివ్వటం లేదు. ఉరుముల్లో—పిడుగుల్లో వర్షంకురిసి వెలిసినట్టుగా వుంది.

'చాలా సామానువుందే!' అంటూ నవ్వటానికి ప్రయత్నించాను. కాని శారదరాక నాలో భయాన్ని రేకెత్తించింది నలుగురిలో చెప్పుకునేందుకు సరోజ నాకు దూరపుచుట్టమైనా కాదు—

'అబ్బబ్బ!...ఏం వర్షం!...నాకు ప్రకృతి కూడా చక్కటి స్వాగతం పలికింది.' శారద నవ్వు కుప్పెట బిగించి లోకానికి చూపుతూ అందులో ఏంవున్నదీ కనుక్కోమన్నట్టుగా వుంది.

'చాలా అలిసి పోయుంటావు. స్నానం చేస్తావా? అదే బాత్ రూం.' ఆమెకు టవలు యిద్దామనుకుంటుంటే ట్రంకులోంచి మరోటి తీసుకుంది. చీర - జాకెట్టూ తీసుకుంది.

రేడియో వాల్యూం కొద్దిగా హెచ్చించాను. ఏదో హిందీ రికార్డు - సగం చదువుతూ వదిలేసిన 'రెబెకా' తీశాను. కొత్తగా వచ్చిన మిసెస్ డీవింటర్ పరిస్థితుల్ని చూసి జడుసుకుంటోంది. కిటికీలోంచి జల్లు కొట్టింది - అకాలవర్షం కూడా.

శారదకూ నాకూ వున్న పరిచయం నాలుగేళ్ళ కాలపరిమితిలోకి వస్తుంది. కాలేజిలో శారద చదివేటప్పుడు ఆమెకు ఉపాధ్యాయుణ్ణి - ఆమె బి. ఏ. పూర్తవగానే నేనిక్కడకు రావటం తటస్థించింది. ఆమె పాసయిందీ లేనిదీ కూడా నాకు తెలియదు. 'అంతకంటె ఎక్కువ పరిచయం వుందా?' అనే ప్రశ్న వేస్తే నలుగురికీ తెలియకుండా వుండటంకోసం అవునని తలవూపక తప్పదు. ఆ ప్రశ్నకు నిజమైన సమాధానం కావాలంటే నా అంతరాత్మను విమర్శించుకోవాలి. అందుకు నాకే యిష్టం వుండదు. ఆ ప్రశ్న స్ఫురించగానే దాన్ని బయటకు నెట్టివేస్తాను

గడచినదానికీ - ప్రస్తుతానికీ మధ్య అగాధాన్ని సృష్టించుకుంటేనే కాని సుఖపడలేను. అదంత తేలిగ్గా జరిగేదీ కాదు. జరిగిన ప్రతీక్షణం మర్చిపోయే సహజ తత్వం మనకుంటే అసూయలు - వైషమ్యాలు - ప్రతీకారాలు వుండవు. అయినా శారద ప్రతీకారం చేయడంకోసమే వచ్చిందని ఎందుకనుకోవాలి!

శారద స్నానం చేసి వచ్చింది బోర్డర్ లేని గులాబీరంగు చీర - తెల్లటి వాయిల్ జాకెట్టు - కడిగిన ఆణిముత్యంలా వుంది.

'చాలా ఆకలిగా వుందనుకుంటాను. నేను హోటలు పక్షిని' అంటూ రెండురోజుల క్రితం కొన్న షాంగ్రిలా బిస్కట్లు ప్లాస్టిక్ ప్లేట్‌లో వుంచి ఆమె ముందు వుంచాను. అదృష్టవశాత్తూ అరగంట తరువాత రుచిచూద్దా మనుకున్న అరటిపళ్లు కూడా అవసరానికి ఆదుకున్నాయి. ప్లాస్కులో వున్న పాలుకూడా ఆమెముందు వుంచాను.

'ఇదే భోజన మనుకోవాలి.'

'థాంక్స్. మీకు చాలా శ్రమకలిగిస్తున్నాను. అసలు మీకు శ్రమకలిగించటానికే ఇక్కడి కొచ్చా ననుకోండి' అంటూ నిర్లక్ష్యంగా నవ్వింది.

'బెజవాడ నుంచేనా?'

'ఆ... నేను ఆర్నెల్ల క్రితం పంపిన శుభలేఖ మీకు అందేవుంటుంది. కాని మీరుమాత్రం ఆశీస్సులు పంపలేదు మీరు దీవించివుంటే నాజీవితం మరోలా వుండేది.'

శారద ఆరోపణలో నిజం లేకపోయినా ఆమె మనసులో ఏదో వుంచుకుని మాట్లాడుతోందని నాకు అర్థమయింది.

'నిజానికి నీ శుభలేఖ అందేసరికి నే నిక్కడ లేను. నేను తిరిగివచ్చి చూసుకున్నాను. అప్పటికి మీ పెళ్ళై ఆరురోజులయుంటుంది.'

తుపానుకు ముందు సముద్రం ప్రశాంతంగా వుంటుందట!

'శంకరం బాగున్నాడా? ... అతన్నికూడా లాక్కురాలేకపోయావా?'

'మేష్టారూ!...మీ హృదయంలో వుండే ఆరాటం నాకుతెలుసు— నే నెందుకువచ్చానని?— ఎల్లా అడగాలో మీకు తెలియటంలేదు—ముసుగులో గుద్దులాటెందుకు? నేను శంకరాన్ని వదిలివచ్చాను— పెళ్ళై ఆర్నెల్లవగానే ఏమిటీ అఘాయిత్యమని మీ రడుగులారు. నా తత్వం మీకు కొత్తకాదు.'

బయట ఆకాశం ఉరిమింది. ఆ పిడుగు నా నెత్తిన పడ్డట్టే వుంది. రేడియో సంగీతం కర్ణకఠోరంగా వినిపించింది. కట్టేశాను. అయితే ప్రతీకారం ఆరంభమైందన్నమాట!

'శంకరంలో నా కెలాంటి లోపాలూ కనపడలేదు. అతన్తో నీకు మనస్పర్థ ఎట్లాగేర్పడిందా అని నేను ఆశ్చర్యపోతున్నా. ఇంతకీ కారణం?'

శారద తలవంచుకుని సమాధానం చెప్పింది.

'క్షమించండి మాష్టారూ!... నేను చెప్పలేను. శంకరంమీద మీకున్న సదభిప్రాయాన్ని మార్చుకోవద్దు.'

'పొరబడ్డావేమోనని- మళ్ళీ ఆలోచించుకో-'

ఈ మాటకు శారద ఆకులురాలినట్టు నవ్వింది.

'కళ్ళనూ — చెవుల్నీ నమ్మకూడదనుకుంటే పొరపాటే అవుతుంది. శంకరానికీ—నాకూ మధ్య తర్క్కం జరిగింది. ఆర్థికపుటుచ్చుల్లో వున్నా మానవుడు కొంతవరకు నైతికజీవితాన్ని గౌరవించాలి. నా ఆత్మను చంపుకోలేను—ప్రపంచం నాకు అర్థమవుతూంది.'

'శారదా!...నువ్వేపరిస్థితుల్లో అతన్ని వదలించుకువచ్చావో నాకు తెలియదు. అటువంటప్పుడు నువ్వు డొంకతిరుగుడుగా ఎన్నిచెప్పినా జరిగింది వూహించుకునే శక్తిగాని—విమర్శించి నిజానిజాలు నిర్ణయించే ఆత్మవికాసంకాని నాకు లేవు.'

మరో విమానందగ్గరగా ఎగిరిపోయింది.

'పోనీండి—నాకీలోకంలో మీరు తప్పించి మరెవరూ లేరు. నన్ను మీరు కేవలం విద్యార్థినిగా భావించి మాట్లాడుతున్నారు కాని మనకున్న పూర్వ పరిచయాన్ని మర్చిపోతున్నారు. నేను కొత్త జీవితం మొదలు పెట్ట దల్చుకున్నాను. జరిగినదంతా పీడకల— దాంతో నాకు ప్రమేయంలేదు. ఇక్కడ నాకేదైనా ఉద్యోగ మిప్పిస్తే మీకు బోలెడు పుణ్యం. నాకు టైప్ రైటింగు చేతనవును. హయ్యర్ గ్రేడు పరీక్షకు వెళ్ళాను కాని ప్యాసుకాలేదు. రెండోది—ఉండటానికి క్వార్టర్సు.'

'అమ్మబాబోయ్!...శ్రీమన్నారాయణమూర్తిని ప్రత్యక్షం చేయిస్తానుకాని అద్దెకు ఆవగింజంత పోర్షనైనా సంపాదించటం నావల్ల కాదు. ఉద్యోగం మాటంటావా? ఆడవాళ్లకి లోటేమిటి? కళ్లకద్దుకు నిస్తారు. నువ్వు కొత్తజీవితం ప్రారంభించ దల్చుకుంటే ఇదే అనుకూల వాతావరణం. ఇక్కడ ఒకరి గొడవ మరొకరి కనవసరం—ఎవరికివారే యమునాతీరే! నీ కథ్యంతరం లేకపోతే నువ్విక్కడే వుండవచ్చు. ఆఖరుసారిగా నే ననుకునేది—నువ్వు శంకరాన్ని అపార్థం చేసుకున్నావేమో నని.'

శారద జవాబు చెప్పలేదు. తెల్లగావున్న గోడకేసి చూసింది.

టైప్ రైటింగ్ తెలియకపోతే శారద కింత త్వరగా వుద్యోగం దొరక్కపోను అందులోనూ జీవితాన్ని కొద్దిగా అర్థం చేసుకున్నదేమో, ఇంటర్వ్యూలో బాస్‌ని మెప్పించేసింది. జీతం నూటపాతికైనా నిరాశపడ నవసరంలేదు. గుడ్డిలో మెల్ల—నా వాటాకు ఇరుప్రక్కలా వున్నవారు మా యిద్దరి అనుబంధం గురించి ప్రశ్నించారు. దూరపు బంధువని, వరసకు చెల్లెలవుతుందని చెప్పాను. నేనేమీ తప్పు చేయనప్పుడు నిజం ఎందుకు చెప్పలేకపోతున్నానో అర్థం కాలేదు. వాళ్లు ఏమైనా అనుకుంటారు—నాలోని బలహీనతకు నవ్వొచ్చింది.

శారద వచ్చిన నాలుగు రోజులకే చాలా మారింది. మొహంలో ఏదో కొత్త కళ వచ్చినట్టైంది. తనకు వివాహమే అవనట్టు ప్రవర్తించింది. చుట్టుపక్కల వారితో స్నేహం కుదుర్చుకుంది. తనూ శంకరం పెళ్లి అయిన కొత్తలో తీయించుకున్న ఫోటో నూ పెట్టింది. వాళ్లి మొహాల్లోవుండే చిరునవ్వు—స్వచ్ఛత ఇట్లా విషాదాంతమవుతాయని ఎవరూ వూహించలేరు.

'ఆ ఫోటో గోడకి తగిలించకూడదూ?' అనడిగాను.

'వద్దని పెట్టె అడుగున దాచేసి తలిమ్మా సామానుతో పెట్టేసింది. పొరపాటునైనా ఆ ఫోటో తనకు కనపడకూడదని ఆమె అభిప్రాయం.

శారద వచ్చి వారంరోజులు దాటింది. ఈ ఏడు రోజుల్లో ఆమె గతాన్ని త్రివ్వటానికి ప్రయత్నించలేదు. భగవంతుడికి నమస్కారమనుకున్నాను. కాని ఎనిమిదోనాడు రాత్రి నాకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. గడియారం పన్నెండు కొట్టింది. యథాలాపంగా నాకు మూడుగజాల దూరంలోవుండే శారద పక్కకేసి చూశాను. అది ఖాళీగావుంది. నా తలవైపునున్న కిటికీ దగ్గర ఎవరో వున్నట్టు అనుమానం కలిగింది. చప్పుడు కాకుండా తిరిగిచూశాను. శారద! కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమె తల్లోవున్న మల్లెపూలు పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. శారద నాలుగైదుసార్లు నన్ను పూలు తెమ్మంది.

'నువ్వే తెచ్చుకోకూడదా?' అనడిగాను నాకు లోపల బాధగా నేవుంది. భర్తను వదిలేసింది. ఇంకా పూలకోసం పాకులాటెందుకు?

'షోర్టులో మంచివి దొరకవు. మీ కాలేజీకి దగ్గరున్న మార్కెటులో అప్పుడు కోసినపూలు దొరుకుతాయి' అని సమాధానం ఇచ్చింది.

ఈ మాటలంటూ శారద విసిరిన చిరునవ్వు నేను ఎనలైజ్ చేసుకుంటే నాకు భయం వేసింది. నా నిర్ణయం సరైంది కాకపోవచ్చు. అయినా శారద తన భావిజీవితాన్ని గురించి ఏమని నిర్ణయించుకున్నట్టు? ఆ ప్రశ్న అడగాలనుకున్నప్పుడు నాలుక చివరదాకా వచ్చి ఆగిపోయేది. ఆఖరుకు మా బిల్డింగులో వున్న వాళ్ళందరికీ పూలు తెచ్చేవాడితో తనకూ కూడా తెచ్చేట్టు ఏర్పాటు చేసుకుంది.

శారద లైటు వేసింది.

'మీకు నిద్ర పట్టలేదని నాకు తెలుసు...అంతా నటన! చిత్రం! గంటక్రితం గురక కూడా పెట్టారు!' అంటూ నో జడను ముందుకు లాక్కుంది.

'ఆ బాధ అనుభవించేది నువ్వు! నా కెలాంటి మానసిక బాధలూ లేవు...వెళ్లి పడుకోరాదూ! నిశిరాత్రి దాటింది. రేపు టైపుమిషనుముందు కునికిపాట్లు పడతావు'

ఈమాట లంటున్నానుకానీ నా దృష్టి శారద చీరమీద వుండిపోయింది. సాయంత్రం సాదా రంగు చేనేతచీర కట్టుకున్నట్టు జ్ఞాపకం. ఇంతట్లో గులాబీ రంగు వాయిల్‌లోకి ఎప్పుడు మార్చిందీ ఎందుకు మార్చిందీ అర్థంకాలేదు. 'మగవారంతా స్వార్థపరులు. అవసరం తీరాక మర్చిపోతారు. క్షణానికో బుద్ధి.

అయినా నేను వుద్యోగం మానేసినా మీరు పోషించటానికేమిటి?' ఈసారి నాముందుకు వచ్చి నిలబడి తన ప్రశ్నకు సమాధాన మిమ్మన్నట్టుగా చూసింది.

శారద ఎందుకీమాట లంటున్నదీ నాకు కొద్దిగా అవగాహనైంది. అయినా ముందే చెప్పాను గడచిన జీవితంగురించి తల్చుకోటమంటే నాకు చాలాభయం. ఎవరితోనూ చెప్పను. దీని పర్యవసానం మంచిగా పరిణమించదనీ తెలుసు. అయినా పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోలేను. పిరికివానిలా వెనక్కి పారిపోనూలేను. అది హృదయ దౌర్బల్యం కావచ్చు. బాణాల్లా దూసుకుపోతున్న శారద చూపులు—

అయినా ఒకటిమాత్రం అందరూ అంగీకరిస్తారు అభిప్రాయాలు, నమ్మకాలు స్థిరంగా ఉండవు పరిస్థితుల కనుగుణంగా మారిపోతాయి పదమూడు నెలల క్రింతం నాకు స్త్రీ మీద గౌరవం లేకపోవచ్చు ఆట వస్తువుగా భావించి అందిన అవకాశాన్ని జారవిడువక పోవచ్చు—కాని అభిప్రాయాలు—జీవితంమీదుండే దృక్పథం మారటానికి పదమూడు నెలల కాలవ్యవధి చాలదా అని నా అనుమానం.

'అయినా ఆ చీకట్లో అర్ధరాత్రి చూడవలసిన సౌందర్యమేముంది?

'మీకు పాతబడిపోవచ్చు. కాని నాకుమాత్రం కొత్తే!' అంటూ శారద లైటుఆర్పేసి పడుకుంది. శారదచెయ్యి నాముఖానికి తగిలింది. అది అనుకోకుండా నే - పొరపాటున జరిగుండాలని నన్ను నేను తృప్తిపర్చుకున్నాను.

ఆ మర్నాడు శారద యథాలాపంగా నే వుంది చిత్రమేమిటంటే మా ఇద్దరి హృదయాల్లో రహస్యాలు పోలెకున్నాయి. అవి ఎవ్వరికీ చెప్పలేం సరికదా-మాలో మేమే అనుకోలేం- పక్కనేవున్న జూహూ బీచ్‌కి వెడదామని శారద వారంరోజులుగా పోరు పెడుతోంది. ఆదివారం కావటంమూలాన పరేనని బయలుదేరాం.

ప్రపంచంలో వున్న అశాంతిని వెలిగక్కుతున్నట్టు సముద్రపుటలలు ఎగిరిపడుతున్నాయి కొందరు ఆంగ్లో ఇండియన్ అమ్మాయిలు జలక్రీడ లాడుతున్నారు. 'వీళ్ళెప్పుడూ ఆనందంగా వుంటారుకదా!... వీళ్ళకు మానసికబాధలుండవా?' అనేది నా అనుమానం. నిజానికి కొందరిజీవితాల్ని సూక్ష్మంగా పరిశీలించాలనివున్నా అవకాశం చిక్కటంలేదు. శారద ముందుకువెడుతోంది. ఓచేత్తో చీరతడవకుండా కుచ్చెళ్ళు ఎత్తిపట్టుకుంది కెరటాలు కాళ్ళను చుట్టివేస్తున్నాయి అంతూ - దరీ లేకుండా పొంగి పొరలిపోతూన్న సముద్రాన్ని చూసేసరికి నాకు భయం వేసిందికూడా! వెనక్కి తిరిగి ఇసకలోకి నడిచిపోయాను. మోచెయ్యి తలగడగావుంచుకుని పడుకున్నా.

'మేష్టారూ!....నాకు జీవితంమీద ఎలాంటి అభిప్రాయంవున్నదీ చెప్పనా?...మీరు తప్పనుకోకండి. ఉండేది నాలుగురోజులని పెద్దలే అన్నారుకదా! చేతికందినంతవరకూ ఆనందమనుభవించటమే ఉత్తమ మార్గం అంతేకాని ఆచారాలు - అర్థంకాని పట్టింపులూ - నీతీ న్యాయం - అంటూ గోడలుకట్టుకూర్చుంటే అదో విషాదగీతమవుతుంది. ఒమర్ ఖయ్యాంతత్వం మీరు చదువలేదూ!... మందమతిని. బి. ఏ. లో పొయిట్రీకి మీరేగా వస్త! కొన్ని సవరణలు చేస్తే అదే వుత్తమమైనదంటాను. సవ్యాపసవ్యాలు విచారిస్తూ కూర్చుంటే అవులించినట్టు కాలం తుర్రుమంటుంది. ఏమంటారు?'

శారదకు చెప్పవలసిన సమాధానంగురించి నేను ఆలోచించలేదు. ఈమాటలు బ్రౌనింగ్ వింటే ఏం చేస్తాడని. విపరీతపు టాలోచన మొదలు పెట్టాను నెత్తీ నోరూ బాదుకుంటాడా? అమాంతం ఆ మాటలన్నవాడిమీద విరుచుకుపడతాడా?...... లేక ఆ వాదాన్ని ఖండిస్తూ మరోవంద పేజీలు రాస్తాడా?......

'మాట్లాడరేం?...ఆలోచన తెమిలిందా?' అంటూ లేచికూర్చుని బద్ధకంగా వళ్ళువిరుచుకుంది. తల్లో వున్న ఎర్రరిబ్బను గాలికెగురుతోంది. పసిఫిక్ మహాసముద్రం ఎంతలోతు వుంటుందో మర్చిపోయాను.

'నన్నడిగితే జీవితంమీద దృక్పథం ఏర్పరచుకోవటం అనేది అర్థంలేని వాక్యం. క్షణక్షణానికి అభిప్రాయలు-నమ్మకాలు మారుతూంటాయి. ఇవేళ నీకు దేవుడిమీద నమ్మకం లేకపోవచ్చును. పరిస్థితులు రేపు నిన్ను నమ్మించవొచ్చు 'బిహేవియరిజం' అంటూ ఓ సైకాలజీ వుందన్న సంగతి నువ్వు మర్చిపోయావు'

శారద కలుక్కుమంది.

'డొంకతిరుగుడుగా వున్నా చక్కగా సెల విచ్చారు. బసవయ్యగారి బండి సమయానుకూలంగా నడుస్తూంటుందని వెనక ఎక్కడో విన్నాను. మరోటి చెప్పనా?...సమయానుకూలముగా రూల్సు మార్చబడును. కాంప్లిమెంటరీలు చెల్లవు' అంటూ విరగబడి నవ్వింది. కళ్ళు సగం మూతపడి ముఖాని కింకా అందం చేకూరింది. సూర్యకిరణాలను పంచరంగులుగా విభజిస్తున్న నీటిగుంపరల కేసి చూస్తూవుండిపోయాను. ఎక్కడో గనివుందని నలుగురూ అనగానే తవ్వటం మొదలుపెట్టాగు కాని అంతు చిక్కటంలేదు.

'నాలో వున్న లోపం చెప్పమంటారా? నాకు బాధ కలిగించినవాళ్లను కాని-నాకు ద్రోహం చేయదల్చుకున్నవాళ్లనుకాని, నిలదీసి అడగలేను శంకరం విషయంలో అంతే. ఇద్దరిమధ్యా అభిప్రాయభేదం ఏర్పడగానే అతనన్నాడు: 'అయితే నువ్వు వెళ్లొచ్చు అదైనా నీనిర్ణయంమీద ఆధారపడి వుంటుంది' అని. నేను నిలదీసి జీవితభరణం పుచ్చుకోవలసింది.'

'నమస్కారం మేష్టారూ!' అన్నమాటలు విని వెనక్కి తిరిగి చూశాను. శారద మాటల్లో వున్న లోతుపాతుల్ని గురించి ఆలోచిస్తూ సతమతమవుతున్న నాకు శంకరంరాక మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. అతను వస్తాడని నేనెప్పుడూ వూహించలేదు:

'హలో శంకరం!' అన్నాను 'బాగున్నావా?' అనడుగుదామనుకున్నా పక్కన శారదవుంది. అలా గడుగుతే అతనెలా ఫీలవుతాడో యేమో! పక్కన కూచున్నాడు. శారద ఎటో చూస్తూ దోసిల్తో ఇసిక ఎగరబోస్తోంది. శంకరం రాకను గమనించిందా లేదా? అన్న అనుమానం కూడా కలిగింది ఆమె పరధ్యానం చూస్తే.

'ఎప్పుడు వచ్చావ్ బొంబాయికి?'

'వారంరోజు లయిందండి. ఫోర్టులో మా వేలువిడిచిన మేనమామవున్నాడు. అతను కబురంపితే వచ్చాను. నాకిక్కడ వుద్యోగం కూడా దొరికిందండోయ్!'

శంకరం నేనిదివరకు చూసినట్టే వున్నాడు. ఎటొచ్చీ ఈమధ్య హైరోడ్డు క్రాఫింగు మొదలు పెట్టినట్టున్నాడు. మెడ చుట్టూ సిల్కుమఫ్లరు చుట్టాడు. అతని డ్రెస్సింగులో అది ప్రధానాంశం. తిరవాత ఎన్నో విశేషాలు చెప్పుకుపోయాడు. బొంబాయిలో తనకు నచ్చినవీ నచ్చనవీ-గుజరాతీ అమ్మాయిలు బాగున్నారా? మరాఠీ అమ్మాయిలు బాగున్నారా? సబర్బన్ ట్రెయిన్సులో ప్రయాణం చేసేదానికంటే తెల్లవారుజామున బయలుదేరి నడిచి వెళ్ళటం మెరుగన్నాడు.

'శారద వచ్చి రెండు వారాలు కావస్తూంది.' అని అతని సమాధానంకోసం చూశాను అతనది విని పించనట్టు తన ధోరణిలో సాగిపోయాడు. ఈ మాటలు శారద ముఖంమీద ఎలాంటి మార్పు తీసుకువస్తాయో చూద్దామనుకున్నానుకాని ధైర్యం చాలిందికాదు.

'నాకు తలకాయ నెప్పిగా వుంది. పోదాం పదండి' అంది శారదలేచి నిలబడి

'మరి నేను సెలవు తీసుకుంటానండి. బహుశా నా మాటలు మీకు తలనెప్పిని కలిగిస్తాయి మరో మనవి. ఇది నా ఎడ్రసు మీరు వీలైతే రండి... నేనే వస్తాను లెండి' అంటూ చిన్న కాగితం ముక్క నాకిచ్చి వెళ్ళిపోయాడు. శారద మళ్ళీ కూర్చుంది.

'ఇంతకీ నీ భావిజీవితంగురించి ఏమిటి నిర్ణయించుకున్నావు?' అనడిగాను ఇద్దరికీ సంధి చేద్దామన్న అభిప్రాయం మనసులో వుంది కాని దాన్ని బహిర్గతంచేస్తే శారద విరుచుకుపడుతుంది. 'ఇలాగే వుంటాను...' ఏం? మొగుడొదలేసిన ఆడది వుందనుకోండి. ఏంచేస్తుంది? చేసుకునేవాళ్లుంటే తిరిగి వివాహం-కోపం వొస్తూందికదూ మీకు? దగ్గర్లో వెలుగున్నా-చీకటిని వెతుక్కుంటూ వెళ్లేవారు సంఘానికి విద్రోహులు...అదీకాక మీరెంత బాధపడుతున్నారో నాకు తెలుసు. నేనిలా మీ దగ్గరుండటం నలుగురిమధ్య మిమ్మల్ని విమర్శకు గురిచేస్తుంది. పోనీ నన్ను తిరిగి శంకరం దగ్గరకువెళ్ళి ఏలుకోమని కాళ్లావేళ్లా పడి బ్రతిమాలు కోమంటారా?'

రెండు వాన చినుకులు మీద పడ్డాయి.

'వర్షం వచ్చేట్టుంది. పోదాంపద-మళ్ళీ బస్సు అందుకోవాలి' అంటూ శారదకు సమాధానం యివ్వకుండా తప్పించుకున్నాను.

శారద వాస్తవికతతో తృప్తిపడేరకంకాదు. ఆమెలో చంద్రగ్రహం, అంగారకగ్రహాల్లో వుండే వింతలు - ఆకాశాన్ని చీల్చే కోరికలు - వున్నాయని

నాకు తెలుసు. కాని అగ్నిపర్వతం బద్దలవటమే ఆలస్యం. దాన్ని అడ్డగించటం అసంభవం.

రెండు రోజులు గడిచాక ఏదో పబ్లిక్ హాలీడే వచ్చింది. శంకరం మా యింటికి రాడని ఎలాగూ తెలుసు. ఆ వుదయమే బయలుదేరి వెళ్లాను

అతను వుండేది కుర్లాస్టేషనుకు దగ్గరగా ఒక్కటే గది. చుట్టూ బోలెడంత మురికి. నీటి సదుపాయంకూడా లేదు. నన్ను చూడగానే చదువుకుంటున్న పుస్తకం మూసేశాడు. ఎలక్ట్రిక్ స్టౌమీద అన్నంగామోలు - ఉడుకుతోంది. బల్లమీది పుస్తకం తీసి చూశాను శివానంద సరస్వతి రచించిన పుస్తకం. షెల్ఫ్ కేసి చూశాను- ముందు కనిపించింది భగవద్గీత! పదమూడు నెలల క్రితం అతను సినిమాపత్రికలు - సెక్స్ పత్రికలూ తెప్పించి మరేవీ చదివేవాడుకాడు. కాలేజీ డిబేట్లలోకూడా వేదాంతం నిజాల్ని కప్పిపుచ్చే మత్తుమందని, కంటికి కనిపించని దేవుణ్ణిగురించి ఆలోచించటం పొరపాటని వాదించేవాడు. నన్ను కుర్చీలో కూర్చోమని తను కాఫీ పెట్టాడు.

'ఈమధ్య చిక్కినట్టున్నావ్?' అన్నాను అతన్ని గమనిస్తూ.

'అవునండి. రెండురోజులక్రితం జ్వరంవచ్చింది. అయినా ఈమధ్య నాఆరోగ్యం బొత్తిగా బాగుండటం లేదండి.'

"కొంతసేపు భగవద్గీత చూస్తూ కూర్చున్నా. శంకరం కాఫీగ్లాసు ముందు వుంచాడు.

'థాంక్స్...సరేకాని నీవు విజయవాడలో చక్కటి వుద్యోగం వుండగా అది వదులుకుని ఇంత దూరం రావలసిన ఖర్మేమొచ్చిందని?'

'మీరన్నీ తెలిసే అడుగుతారు. సరే—కానీండి. అక్కడ నా జీవితం విషాదగీతంలా పరిణమించింది. ఎందుకో ఆప్రదేశాలు—ఆయిళ్లు—అన్నీ చూస్తుంటే గడచిన జ్ఞాపకాలువచ్చి భరింపరానిబాధ కలిగేది. ఇంక దాన్నివదిలి దూరంగాపోయి కృత్రిమజీవితాని కలవాటుపడకపోతే నేనో న్యూరోటిక్ పేషంటుగా తయారవుతానన్న భయం కలిగింది. మా మేనమామ కూడా రమ్మన్నాడు. వచ్చేశాను.'

ఓ నిమిషంసేపు నిశ్శబ్దత తాండవించింది.

'అది సరేకాని ఓచిన్నవిషయం అడుగుతాను చెప్తావా?'

శంకరం నవ్వాడు.

'మీరడగబోయే ప్రశ్న నాకు తెలుసు శారదకూ నాకూ మధ్య జరిగిన ఘర్షణగురించి—అవునా?' అవునన్నటు తలూపాను

'క్షమించండి—ఆవిషయం ఇతరులకు తెలియకూడదనుకున్నాం అందుచేత చెప్పలేను' అన్నాడు తలవంచుకుని—

ఇంక ప్రయత్నించి లాభంలేదనుకున్నా.— అసలు నేను పనికట్టుకువచ్చింది అందుకే!

'నీకస్తమానం జ్వరం వస్తూందికదా!...మా యింటికి రాకూడదూ? నిన్నిక్కడ చూసేదెవరూ? మీ మేనమామ ఫోర్టులో వుంటాడు నువ్విక్కడుంటావు. ఎట్లా ఆదుకోగలడు?'

శంకరం రెండుమూడు నిమిషాలు మాట్లాడలేదు నామాటల్లోవుండే అంతరార్థం అతను వూహిస్తున్నాడనుకుంటాను.

'సరే వస్తానండి నాకంటే అనుభవం వున్నవారు. మీ మాటెందుకు కాదనాలి?...రేపు సాయంత్రానికి సామానుతో దిగుతాను.' మరో అరగంట గడిచాక తృప్తిగా తిరిగివచ్చాను. శారదతో ఆమాటలు చెప్పాను. ముఖం పాలిపోయింది. దాన్ని పైకి కనబడనీయకుండా ముఖకళవళికలు మార్చుకుని నవ్వింది.

'మీరువెళ్లి చేసుకొచ్చిన ఘనకార్యమిదన్నమాట!...బలంవున్నవాళ్ళదే రాజ్యం—అతనిక్కూడా వండుకునేబాధ తగ్గుతుంది. సుఖపడతాడు. మరో పెళ్ళి చేసుకునేదాకా ననుకోండి.'

'ఎవరి పెళ్ళయ్యేదాకా?' అంటూ నవ్వేశాను. శారద కూడా నవ్వింది.

మర్నాడు సాయంత్రం శంకరం సామానుతో దిగాడు శారద అతనిముందు కాఫీ వుంచింది. ఇద్దరూ గజం దూరంలోవున్నా ఒకరినొకరు చూసుకోటం లేదు. శంకరం పెట్టెలోంచి తన పెళ్ళినాటి ఫొటో తీసి గోడకి తగిలించాడు. అతనెందుకలా చేసిందీ నాకర్థం కాలేదు నా సమస్య యిది. శారద కనక తన తప్పిదానికి (ఆమె తప్పు చేసివుంటే) క్షమాపణ చెప్పకుంటే శంకరం తిరిగి ఏలుకుంటాడా? శారద

మీద అతని కనురాగం వుందా లేదా? కేవలం పట్టింపు కోసం తన మనోభావాల్ని - ఆత్మను అణచివుంచాడేమో! అందుకే అతన్ని సూక్ష్మంగా పరిశీలించవలసి వచ్చింది. నిజానికి అతినన్న ప్రతీమాటను - అతని నవ్వును - విపరీతార్థాలు కల్పించుకు నేవాణి. రాత్రి భోజనంసగ్గర వడ్డించేటప్పుడు కూడా శారదను గమనించాను. పొరపాటునైనా అతనికేసి చూడలేదు.

'మేష్టారూ!...ఇంకొంచెం నెయ్యి కావాలి' అన్నాడు నాకేసి తిరిగి శారద నెయ్యి వడ్డించింది. ఆక్షణంలో శారద చిరునవ్వును బలవంతాన వారించుకుని గంభీరంగా వుండటానికి ప్రయత్నిస్తున్నట్లనిపించింది. నాలో విజయచిహ్నాలు తలెత్తాయి కూడా.

నేనెంత వారించినా అతను వినకుండా బయట పడుకున్నాడు. నాకు చాలా బాధకలిగింది 'శంకరం నన్ననుమానిస్తున్నాడా?' అనిపించింది. అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న మొగుడూ, పెళ్లాం, వేర్వేరుగా వుండటం—పరాయివాణ్ణి నేను మధ్యవుండటం—పోనీ వీధి తలుపు తీసివుంచుదామనుకున్నా-దొంగలభయం ఎక్కువ—అందుకని తలుపు మూయక తప్పిందికాదు. అతను బయట—నేనూ శారదా లోపల—ఛీ...ఛీ...అతనేమనుకుంటాడో! రాత్రి పన్నెండుదాకా నిద్ర పట్టలేదు. శంకరం రెండు మూడుసార్లు కిటికీదగ్గరకు వచ్చి లోపల నే వున్నానో లేదోనని చూసినట్లు అనుమానం కలిగింది. అది భ్రమే కావొచ్చు.

మర్నాడు సాయంత్రం నేను ఆఫీసునుంచి వచ్చేసరికి శంకరం ముసుగు తన్నిపట్టి పడుకున్నాడు. శారద వోమూల కూర్చుని ఏదో నవలగాబోలు—చదువుతోంది.

'ఏమిటి సంగతి?' అనడిగాను శంకరందగ్గరకు వెళ్ళి.

'మళ్ళీ జ్వరం వచ్చిందండి—అందుకే నేను వంటరిగా వుండటం మంచిదంటాను వృథాగా మీకు బాధ కలిగించి నామీద మీకున్న అభిమానాన్ని చంపుకుంటున్నాను.' అతని కంఠం అప్పుడే ఐస్ టబ్‌లో మునిగినట్లుగా వుంది.

'అబ్బే...అలాంటిదేం లేదు. జ్వరం అందరికీ వస్తుంది. అంతమాత్రంచేత బాధపడి లాభం లేదు. కాఫీ తాగావా?' నుదుటిమీద చెయ్యివేస్తూ అడిగాను.

'ఊఁ...' అంటూ మూలిగాడు.

కింపవాటాలోవున్న డాక్టరును తీసుకువచ్చాను. పరీక్షించి చూశాక మందుసీసా తీసుకురమ్మన్నాడు. రేపటికి తగ్గకపోతే ఇంజక్షనివ్వొచ్చన్నాడు.

ఆ మర్నాడు పొద్దున్న జ్వరం తగ్గినట్టే కనిపించింది. కాని సాయంత్రానికి మళ్ళీ ఎక్కువైంది. డాక్టరు ఇంజక్షనిచ్చిపోయాడు. రాత్రి ఏడు దాటినా శారద రాలేదు. నాకు భయమేసింది. నేను శంకరాన్ని తీసుకవచ్చానని ఎక్కడికైనా పోయిందేమో! ...లేక విసుగెత్తి ఆత్మహత్య చేసుకుందా?....ఛీ.... శారద ఎప్పుడూ అపని చెయ్యదు మరో వందమంది మగాళ్లను ఏడిపించుకు తింటుంది అదామెకో సరదాయేమో!...ఓనాడు ఫ్లోరా ఫౌంటెన్ దగ్గర ఓ పడుచు కుర్రాడితో నవ్వుతూ పోతున్న శారదను చూశాను. మరోనాడు వి. టి లో ఆమెను వీడ్కోలిస్తూ చేతి రుమాలు వూగిస్తున్న మరో యువకుణ్ణి చూశాను. ఇవన్నీ మళ్ళీ కళ్ళయెదుట ప్రత్యక్షమై నన్ను కలవరపరిచాయి.

శారద ఇల్లు చేరుకునేసరికి ఎనిమిదైంది. రాగానే విసుగ్గా హేండ్‌బాగ్ టేబిలుమీద విసిరికొట్టింది.

'ఆలస్యమెందేం?' అనడిగాను. అడగటానికి హక్కు లేకపోయినా—

'ఆ... మేనేజరుకీ నాకూ మధ్య ఘర్షణ—ఫలితం—నా వుద్యోగానికి రాజీనామా యిచ్చేయటం; హేండ్ డెలివరీ-' అంది.

శారద ఇదివరకోమాటు అననే అంది. తను ఉద్యోగం మానేస్తే నేను పోషించకుండా వుంటానా అని—

మరో వెర్రినమ్మకంకూడా కలిగింది. శంకరానికి సపర్యచేసి అతని అనురాగాన్ని తిరిగి - పొందటానికోసం—మధ్య అడ్డంకుగా ఉంటున్న ఈ నౌకరీని కావాలనే వదల్చుకుందా?....ఇక్కడ శారదే శంకరంతో పోట్లాడిందని. శంకరం నిరపరాధని నేనెందుకనుకుంటున్నానో తెలియలేదు బహుశా అది సహజ తత్వం కావచ్చు.

'ఏమిటా ఘర్షణ?'

'ఏముంది? పడుచుపిల్ల కనపడగానే నూటికి తొంభైమంది మగవాళ్లకు ఒక్కటే రకం భావం

స్ఫురిస్తుంది. అంతే—ఇంక దాన్ని వ్యాఖ్యానించమని నన్నడక్కండి.'

'అడగను కాని బార్లీ తీసుకువచ్చాను. అతని కొంత జావ కాచివ్వగలవా?'

'నాకంటె ముందు వచ్చారుకదా!...స్టౌ వెలిగించలేకపోయారా?' అంటూ వంటింట్లోకిపోయింది. శారద సమాధానం విన్నాక కొద్దిక్షణాల క్రితం నాకు స్ఫురించిన అభిప్రాయం సరైంది కాదేమో ననిపించింది.

శారద రాజీనామా చేసినందుకు ఒకవంక సంతోషంగా వున్నా మళ్ళీ ఉద్యోగప్రయత్నం చేస్తుందని మరోవంక బాధగావుంది. కొంచెం ఇంచుమించు శారద నాతోపాటే ఆఫీసుకువస్తుంది. నాకంటె పావుగంటముందుగా తిరిగి వస్తుంది. అందుచేత వాళ్ళిద్దరూ తమతమ పొరపాట్లను సరిదిద్దుకోటానికి - ఒకర్నొకరు అర్థంచేసుకోటానికి అవకాశం లేదనుకుంటూ - ఇప్పుడా పరిస్థితులు దైనికంగావచ్చాయి.

మర్నాడుపొద్దున్న పక్కవాటాలో వున్నాయన నన్నుపిలిచి శారదగురించి - శంకరంగురించీ అడిగాడు. మంచివాడు కనక నిజం చెప్పాను. నాగురించి ఆ బిల్డింగులో వున్నవాళ్ళు ఏమనుకుంటున్నదీ ఆయన వివరించాడు. నేను వ్యభిచారిననీ - శారదను నేనే తీసుకువచ్చానని చిలవలుపలవలుగా కథలల్లి చెప్పుకుంటున్నారట అయితేనేం?......ఆ చుట్టుపక్కల వున్నవాళ్లందరిదగ్గరా సత్యనారాయణ పూజకి చందా వసూలుచేసేటప్పుడు నాదగ్గరకూడా వచ్చారు. నేను రూపాయివ్వగానే నన్ను చాలాపొగిడారు. నాకు దైవచింత ఎక్కువని-పూజకూడా వచ్చి దాన్ని విజయవంతంగా నిర్వహించవలసిందని క్రింద వాటాలోవున్న మరాఠీ ఆయన ప్రశంసించాడు. మానవనైజంమీద అల్లిబిల్లిగా అల్లుకుంటున్న అభిప్రాయాలు ఇప్పుడు సరైనతోవలో పడ్డాయి రూపాయిస్తేచాలు - ఎంతైనా గౌరవాన్ని - ప్రశంసల్ని అందుకోవచ్చు. అయిదు రూపాయలు - కాదు వంద రూపాయలిస్తే? అమ్మో! అప్పుడు పొగడ్తలకు అసలు తట్టుకోలేం.

'నేనుకూడా మిమ్మల్ని నమ్మలేకపోతున్నాను. సుమండి - మానవతత్వం అలాంటిది. ఏమీ అనుకోకండి- అంతమాత్రంచేత మీమీద నాకు విరోధంకాని - చెడు అభిప్రాయంకాని లేదుసుమండి.' అన్నాడాయన.

'అది సరేకాని మీరు నాకోచిన్న ఉపకారం చెయ్యాలి. వాళ్ళిద్దరూ ఎడమొహం పెడమొహంగా వున్నారు. నేనులేనప్పుడు ఏమైనా మాట్లాడుకుంటున్నారేమో గమనించండి. నాకూడా యిది మిస్టరీగా వుంది' అన్నాను. ఆయన సరేనన్నాడు.

శంకరానికి వచ్చినజ్వరం మలేరియా అయివుంటుందని డాక్టరు సూచించాడు. విపరీతంగా జ్వరం లేనప్పుడు శంకరం సరదాగా మాట్లాడేవాడు.

'జ్వరంవచ్చిందికదా అని నాకెంతమాత్రం భయం లేదండోయ్ అది శరీరాన్ని - ఆత్మను పవిత్రం చేస్తుంది. అందుకే దాన్ని నేనాహ్వానిస్తాను' అంటాడు. అతనికి మందివ్వటం - జావకాచివ్వటం - నారింజరసం పిండివ్వటం - అంతా శారదే చూసుకునేది. వాళ్ళిద్దరూ ఎప్పట్లాగే వుంటున్నారని పక్కింటాయనన్నాడు. భవిష్యత్తుమీద నమ్మకం లేకపోతే బతకలేం - మనం తల్చుకున్నది, అనుకునేది జరగదని అసంభవమైనదని తెలిసినా ఆ అభిప్రాయాల్ని వదిలించుకోలేం - నెత్తిమీద పిడుగుపడుతున్నా పడకపోవచ్చుననే వెర్రిపూహ చివరిదాకా వుంటుంది. నీటిలో మునిగిపోతున్నవాడికి గడ్డిపరక దొరగ్గానే పట్టుకుంటాడు, అది తన్ను రక్షిస్తుందని కొనవూపిరిలాంటి ఆశ. నాపరిస్థితికూడా అలాగే వుంది.

నాలుగు రోజులు గడిచాక జ్వరం తగ్గింది. కొద్దిగా నడవటం మొదలెట్టాడు. డాక్టరు అది మలేరియా కాకపోవచ్చునన్నాడు. మరో మూడురోజులు గడిచాయి.

సాయంత్రం నేనురాగానే పక్కింటాయన పరుగెత్తుకొచ్చాడు. తలుపులు మూసివున్నాయి.

'ముందిలారండి...' అంటూ తనవాటాలోకి తీసుకుపోయాడు.

'వాళ్ళిద్దరూ ఇవేళ పోట్లాడుకున్నారు. కారణం సరిగ్గా అర్థంకాలేదు. శంకరం మీగురించి ఏదో అసందర్భంగా పేలాడనుకుంటాను. అదైనా అతను ఇంగ్లీషులో అనటంవలన నాకు తెలిసింది. ఆ అమ్మాయి నతను సాచిపెట్టి కొట్టాడు.' ఆయనకు గుజరాతీ తెలుసు

కాని తెలుసుకోరాదు. ఆయనకు అభివందన చెప్పి తలుపుతట్టాను: శారద తలుపుతీసింది. శంకరం మంచం మీద కూర్చున్నాడు. శారద రెండుకళ్ళూ ఎర్రగా వున్నాయి

'ఏంజరిగింది?' అనడిగాను, చుట్టూ పిశాచాలు నృత్యంచేస్తున్నట్టుంది నాకు శారద మాట్లాడలేదు.

'మా యిద్దరిమధ్యా వాదనరేగింది. నేను ఉద్రేకాన్ని ఆపుకోలేక ఆమెను దవడమీదకొట్టాను.' అన్నాడు.

'దీనికంతా మీరేకారకులు— నేను వదలిందుకు వద్దాము నేవచ్చాను ఇంక నేనే ఎవరికీ తెలియనిచోటుకు పోతాను' అంది శారద ఈ అపవాదును ఖండించినా ప్రయోజనం వుండదు. జరగాల్సిందెలాగూ జరిగింది. దీంతో అటోయిటో తేల్చేయడం మేలనుకున్నాను. నాకున్న అధికారంతో శంకరాన్ని నిందించాను.

శంకరం లేచి నిలబడ్డాడు.

'మేష్టారూ...మీ దారికి నేనడ్డురాను. కాని మీరు వృథాగా అందర్నీ బాధపెట్టేదానికంటే మీ మనసులోవున్నట్టు చేయండి. మా యిద్దరిమధ్యా విరోధం ఎందుకు కలిగిందో కూడా చెప్తాను శారద నన్నెప్పుడూ ప్రేమించలేదు. శారద మిమ్మల్ని ప్రేమించింది. మీకూ ఆమెమీద అనురాగం వుందన్న సంగతి నాకు తెలుసు కాని మా పెళ్లి జరిగేటప్పటిది నాకు తెలియదు. మా పెళ్ళికి పూర్వం మీకూ శారదకూ వున్న సంబంధం నాకు తెలుసు మీరు శారదను కన్యగా వుంచలేదనీ నాకు తెలుసు. అది శారదకూడా వొప్పుకుంది. అనురాగం లేని యిల్లాలుతో నాకు ప్రమేయంలేదు జరిగినదంతా పీడకల. ఈ మాటు శారదను ఇదివరకటిమల్లే ఉపయోగించుకోకుండా పెళ్ళిచేసుకోండి. రిజిష్టర్ మేరేజీ పెద్దవారు. మీకు నా సలహా అనవసరం—' శంకరం మొహం అటు తిప్పుకున్నాడు.

నా కాళ్ళకింద భూమి చీలిపోతున్నట్టనిపించింది. అయితే శంకరం నిజం కనుక్కున్నాడన్న మాట... పెళ్ళికాని ఆనందాన్ని వంచించిన నన్ను అథముడిగా తూచి మాట్లాడాడు. ఇంకెందుకు? నేను ఎన్నో విధాల దాన్ని అణచివుంచాలని ప్రయత్నించాను. మీరు కూడా శంకరం ఈ రహస్యం బయట పెట్టేవరకూ నామీద సదభిప్రాయం కలిగివుంటారు. నీతికి భయపడేవాణ్ణని, సంఘం నన్ను వృథాగా కష్టపెడుతోందని అనుకునివుంటారు. మొదట్లో నే చెప్పా. గతంలోకి వెళ్ళటం నాకు భయమని. శంకరం నా నెత్తిన ఈ పిడుగుపడ వేయకుండా వుంటే నా కథ—నా సత్ప్రవర్తన మీరు నమ్మివుందురు కాని కథ అడ్డం తిరిగింది...శారదకేసి చూశాను. ఏవీ మార్పులేదు. గుజరాతీ ఆయన బయట నిలబడి ఏవీ అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు. 'రెబెకా' లోని ఘట్టం జ్ఞాపకమొచ్చింది. ఫేవెల్ 'నువ్వు ఖూనీ చేశావు' అన్నాడు: మాక్సిం ఇరకాటంలో పడ్డాడు. .

శంకరం పగలబడి—విరగబడి నవ్వుతున్నట్టనిపించింది. శారద యిదివరకు విసరిన ఛెణుకుల కర్థం ఇప్పుడు సరిగ్గా అవగాహనవుతూంది. నాకు పాత అనుభూతులు పాతబడిపోయినా తనకు కొత్తేనట! ఆ రాత్రి శారద కావాలనే తన చెయ్యి నాముఖానికి తగిలించిందేమో! తిరిగి నాలో అవినీతిని రగుల్కొల్పటానికి. మైలురాయిలాంటి అభిప్రాయాలనైనా మార్చటానికి పదమూడు నెలల అవధిచాలు! ఫోర్టులో మల్లెపూలు మంచివి దొరకవు!...అనుకుని నేనే తేవాలి.

ఘటుక్కున నాకో ఆలోచన తట్టింది. అది పారితే అపవాదంతా శంకరంమీదికి తోసేయవచ్చు. నేను నిర్దోషినవుతాను. కాని అది కూడా ఇంకెవరూ నమ్మరు—వృథా ప్రయత్నం

మళ్ళీ శంకరం అట్టహాసంగా నవ్వుతున్నట్టనిపించింది.